ఆత్రంగా అడుగుతున్న ప్రశాంత్‌ను మధ్య లోనే అడ్డు తగిలి, "మామగారూ! మన ఎదు రింటి బేబీ చెప్పిందండీ. "ఆంటీ అంకుల్ వచ్చి శిరీషను తీస్కెళ్ళిపోయారు ఎందుకు?" అని నన్నడిగిందండీ. అంకుల్ ఎప్పుడూ అలా ఏ స్నేహితురాలి నాడిలేసి మధ్యలో రారు" అని చెప్పానండీ. "నిజం! ఆంటీ. అచ్చం అంకుల్ లాగే ఉన్నారు" అంది. నేను వెంటనే కాన్వెంటుకెళ్ళి కనుక్కుంటే తెలిసింది మామగారూ! అచ్చం ఆయన లాంటి వ్యక్తే తీస్కెళ్ళారని" అంది వెక్కుతూ.

ఆగకుండా చెప్తున్న శ్వేతను, కంగారుగా చూస్తున్న ప్రశాంత్‌ను చూస్తూ "రంగనాథ్ కొడుకు దీపక్ తీసుకెళ్ళాడు ప్రశాంత్! దానికే ఇంత కంగారు పడిపోయారా?" అంటూ చిర్నవ్వు నవ్వారు.

"అచ్చం నాలాగే ఉన్న వ్యక్తి...."

"ఆగు ప్రశాంత్! దీపక్ అచ్చం నీలాగే ఉంటాడు."

"అదెలా సంభవం డాడీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ప్రశాంత్.

అతను మౌనంగా కిటికీ దగ్గరకెళ్ళి అవతలకి చూస్తూ చెప్పసాగారు.

"చిన్నప్పటి నుండీ ప్రాణ స్నేహితులం నేనూ రంగనాథ్. కలిసి చదువుకున్నాం. ఇంచుమించుగా పెళ్ళిళ్ళు కూడా ఒకేసారి జరిగాయి. కానీ నేను లాయర్నయ్యాను, వాడు డాక్టరయ్యాడు. మీ అమ్మ, రంగనాథ్ భార్య ఒకేసారి గర్భిణీ అయ్యారు. వారం రోజుల తేడాతో ఇద్దరూ ప్రసవించారు. దురదృష్ట వశాత్తు రంగనాథ్ కొడుకును పోగొట్టుకున్నాడు మీ అమ్మ కవలపిల్లలను కని నన్ను విడిచి వెళ్ళిపోయింది. ఆ కవలపిల్లలే నువ్వు, దీపక్. రంగనాథ్ బాధ చూడలేక అన్నింటిలోనూ చెరి సగం పంచుకుంటున్న మేము మిమ్మల్ని కూడా సమానంగా పంచుకున్నాం. కమలకి తెలివి రాక ముందే బాబుని పక్కలో పెట్టేశాను. ఆ బాబు తన బిడ్డే అని ఇప్పటికీ అనుకుంటుంది. కొన్ని రోజులకి వాళ్ళు స్టేట్స్ వెళ్ళిపోయారు" అంటూ ఆగి ఇటు తిరిగి–

"నేను ఇందాక రంగనాథ్ ఇంటికి వెళ్ళి వచ్చేస్తూ అన్నాను." కాన్వెంటు కెళ్ళి శిరీషను తీసుకురావాలి. ఇంటిదగ్గర కోడలొక్కత్తే ఉంటుందని. "మీరు ఇంటికెళ్ళండి అంకుల్! పాపను నేను తీస్కొని వచ్చేస్తాను." అంటూ దీపక్ కారు తీసుకుని కాన్వెంటుకెళ్ళాడు. ఇప్పటికి వచ్చేస్తూనే ఉండాలి. ఏ షాపుకో వెళ్ళి ఉంటారు" అంటూండేసరికి కారు హారన్ విన్పించింది.

రాధాకృష్ణగారు "అమ్మా జ్యోతీ! నువ్వూ, ప్రశాంత్ కూడా ఎప్పటికీ ఈ విషయం కమలా ఆంటీ దగ్గర ఎత్తవద్దేం" అన్నారు.

"హాయ్ డాడీ.... మమ్మీ వచ్చేశాను. డాడీ! ఈ అంకుల్ అచ్చం నీలాగే ఉన్నారు కదూ....' అంటూ ఇంకా ఏదేదో గడగడా వాగేస్తూ ఉంది శిరీష.

కానీ శ్వేత, ప్రశాంత్ చూపులు మాత్రం దీపక్‌నే ఆసక్తిగా చూస్తున్నాయి.

**కుమారి వై. జ్యోతి**
(పార్వతీపురం)

---

**ప్రవంతి నెం: 17లో ఇచ్చిన**
"అచ్చం నాలాగే ఉన్నాడా? నో! ఇది అసంభవం" ఆ హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.
**వాక్యం ఆధారంగా రాసినకథలు.**

# లోకం తెలీని అలోక

ఓ గంట నుండి బాల్కనీలో పచార్లు చేస్తూ ఆలోచిస్తుంది అలోక. తన ఆలోచనలు ఒక కొలిక్కి రావడంలేదు. తను రెండు గంటల క్రితం చూసిన సంఘటనే గుర్తుకువస్తూంది. రెండు గంటల క్రితం తను షాపింగ్ కని బయలుదేరి, మధ్యలో ఒక స్నేహితురాలు కలవటంతో రెస్టారెంట్ కు వెళ్ళవలసి వచ్చింది. రెస్టారెంట్‌లోకి ప్రవేశిస్తుండగా దూరంగా గమనించింది, తన భర్త ప్రశాంత్. ఒకావిడతో చేతిలోచేయి కలిపి బయటికి వచ్చి వెంటనున్నామెతో కార్లో వెళ్ళి పోయాడు. వాళ్ళిద్దరూ బాగా నవ్వుకొంటున్నారు. కార్లో వెళ్ళేటప్పుడు తన భర్త ఆమెను ప్రక్కన కూర్చోబెట్టుకుని ఆమెమీద ఒక చేయి వేశాడు. తన భర్తను ఆ పరిస్థితిలో చూసిన అలోక, షాక్ తిన్నట్టు అయింది. ఆ షాక్ నుండి తేరు కొనేలోపే వాళ్ళ కారు కనుమరుగైపోయింది. అలోక వెంటనే తేరుకుని తన స్నేహితురాలు అక్కడే వుందన్న విషయం కూడా మరిచిపోయి తన కారు స్టార్టు చేసి ముందుకు వెళ్ళిపోయింది. ప్రశాంత్‌ని ఫాలో అవుదామనే ఆమె ఉద్దేశ్యం ఫలించలేదు. వాళ్ళ కారు ఎటు వెళ్ళిందో తెలియ లేదు. విసిగి వేసారిన అలోక తిరిగి ఇంటికొచ్చేసింది. కాలు కాలిన పిల్లిలా అటూ ఇటూ పచార్లు చేస్తూంది. అంతలో బయటకారు హారన్ విని హాల్లోకొచ్చింది. సూట్ కేసుతో హాల్లో కొచ్చాడు ప్రశాంత్. ఎదురుగా అలోక.

"హల్లో అలోక డియర్, నీకొక గుడ్ న్యూస్"

"................................"

"అదేమిటంటే రేపు మనం కాశ్మీర్ వెళుతున్నాం. అక్కడ కొన్ని డాక్యుమెంట్లపై సంతకాలు కావాలని మేనేజర్ ఫోన్ చేసి చెప్పాడు. నీవు కాశ్మీర్ చూడలేదుకదా, అందుకని, రెండు టిక్కెట్లు బుక్ చేయించాను" అన్నాడు.

"........................" మౌనం.

"ఏయ్ ఏమిటి? నేనే వాగుతున్నాను, నీవేమీ మాట్లాడవేమిటి?" అడిగాడు ప్రశాంత్ అలోక గడ్డం పైకెత్తుతూ.

విసురుగా తల పైకెత్తింది అలోక. కళ్ళల్లో నిప్పులు కురుస్తున్నట్టుగా అనిపిస్తుంది.

"మీరివాళ మూడుగంటల ప్రాంతంలో ఎక్కడున్నారు?"

"మూడు గంటల ప్రాంతంలో... ఆఁ.... బాంబే పార్టీతో ఓ టెండర్ విషయమై మాట్లాడుతూ ఆఫీసులో వున్నాను. ఏం ఎందుకని?"

అలోక ముఖం ఎర్రగా కందిపోయింది.

"నో అప్పుడు మీరు ఒక వగలాడితో కారుపై షికార్లు కొడుతూవున్నారు. మీరు ఆమెతో రెస్టారెంటులో నుంచి బయటికి వస్తుండగా నేను స్వయంగా చూసాను."

"ఏమిటి నీకు పిచ్చిపట్టలేదు కదా?"

"కాదా మీరు దానితో తిరగటంకోసం వేరే కారు ఉపయోగించారు. అంతేకాదు, ఈ సూటు కూడా మార్చి వేరేసూటు వేసుకున్నారు. నావైపు చూడకుండానే వెళ్ళిపోయారు." అంది ఏడుస్తూ.

"కాదు అలోకా... ప్లీజ్ నేను మూడు గంటలకు ఆఫీసులోనే వున్నాను. కావాలంటే ఆఫీసుకు ఫోన్‌చేసి తెలుసుకో. అలాగే నా డైరీ చూడు ఇవాళ మూడుగంటలకు బాంబేపార్టీతో అపాయింట్‌మెంట్ ఉందో లేదో" అని అన్నాడు.

అలోక ఫోన్‌చేసి తెలుసుకొంది. అతను చెప్పేది నిజమేనని రూఢి అయింది. కొద్దిసేపటికి తను చూసిన సంఘటన వివరంగా చెప్పింది అలోక.

"ఏమిటి నువ్వనేది? అచ్చం నా లాగే ఉన్నాడా! నో ఇది అసంభవం" హాలు అదిరేలా అరిచాడు ప్రశాంత్ కోపంగా.

"నన్ను క్షమించండి ఎవర్నో చూసి మీరను కున్నాను." అంది అలోక.

"ఇట్సాల్ రైట్ ఇందులో నీతప్పులేదు కదా?" అని సమర్థించాడు ప్రశాంత్. కాని పాపం అలోకకు తెలియదు, ప్రశాంత్‌కు ఒక చిన్న ఇల్లు ఉందని, ఆ రెస్టారెంట్‌వద్ద కలిసింది తన భర్తేనని పాపం పూర్ క్రీచర్ అలోక.

**— ఎం.డి. మగ్బుల్ పాషా**
(వరంగల్)

---

### ఒకథ రాయండి

ఈ క్రింది [illegible] ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడ[illegible]నా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"ఇది నాలుగోసారి? ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నే నడ్డురాను" అన్నాడు శాయి లక్ష్మితో.